

దాగుడు మూతలు

కొన్ని నెలలుగా బులియన్ మార్కెట్‌లో పసిడి ధర దాగుడు మూతలు ఆడుతోంది.

వివరాలు 8లో ▸



అర్ధరాత్రి ఫ్లెక్సీ రగడ

నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ గొడవకు దారితీసింది.

వివరాలు 8లో ▸



పైప్ లీకేజీ.. పట్టించుకోరేం?

ఝరాసంగం మండలంలోని వనంపల్లిలో రెండు నెలలుగా పైప్‌లైన్ లీకేజీ అవడం వల్ల తాగునీరు వృథాగా పోతోంది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సోమశంకర్‌కు శౌర్య పతకం



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు అగ్నిమాపక కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న సోమశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక సేవల శౌర్య పతకానికి ఎంపికయ్యారు. రామచంద్రపురంకు చెందిన సోమశంకర్ 2008లో అగ్నిమాపక డ్రైవర్‌గా విధుల్లో చేరారు. గతేడాది నర్సాపూర్ పరిధిలోని చందాపూర్‌లోని ఎస్.బీ ఆర్గానిక్ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో విధి నిర్వహణలో చేసిన సేవలకుగాను ఈ శౌర్య పతకానికి రాష్ట్ర ప్రభుత్వం ఈయనను ఎంపిక చేసింది. 2017లో ప్రశంసా పత్రం, అదేవిధంగా నగదు ప్రోత్సాహకాన్ని కూడా సోమశంకర్ అందుకున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి: పీఆర్టీయూ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మెదక్ కలెక్టరేట్: పీఆర్టీయూటీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఆర్టీయూటీఎస్ సంఘం ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు మధ్య వారధిగా పనిచేస్తుందని అన్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు త్వరగా విడుదల చేయాలని, సమగ్ర ఉద్యోగుల సమ్మె విరమింప చేయడానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ, గౌరవ అధ్యక్షుడు దుర్గయ్య, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శశిధర్ శర్మ, నాయకులు శ్రీనివాస్, మల్లారెడ్డి, వెంకట్రామిరెడ్డి, నాగరాజు, వీరేందర్, అమీరొద్దీన్, హరిబాబు, చంద్రశేఖర్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా నకిలీ మందుల పట్టివేత

కేసు నమోదు చేసిన నార్కోటిక్ అధికారులు



నకిలీ మందులు తయారు చేస్తున్న పరిశ్రమ

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామిక వాడలోని అక్రన్ పరిశ్రమలో నకిలీ మందులను నార్కోటిక్ అధికారులు పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం విశ్వసనీయ సమాచారం మేరకు నార్కోటిక్ అధికారులు పరిశ్రమలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రముఖ పరిశ్రమలకు చెందిన దాదాపు రూ.2కోట్ల విలువైన నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నారు.

డివైడర్‌కు ఢీకొని యువకుడి మృతి

మరొకరికి తీవ్రగాయాలు

జోగిపేట(అందోల్): జోగిపేట హౌసింగ్‌బోర్డు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొనడంతో ఒకరు చనిపోగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం జరిగింది. అందోలు మండలం అల్మాయిపేటకు చెందిన వాజీద్, పాషలు ద్విచక్రవాహనంపై జోగిపేట నుంచి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలోని డివైడర్‌కు ఢీకొనడంతో బైక్ నడుపుతున్న పాష (25) అక్కడికక్కడే చనిపోగా.. వాజిద్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాష మృతదేహాన్ని ఆసుపత్రిలోని పోస్టుమార్టంకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను గురువారం పంపిణీ చేయనున్నట్లు క్యాంపు కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 10గంటలకు క్యాంపు కార్యాలయంలో నారాయణఖేడ్, మనూరు, నాగల్‌గిద్ద, నిజాంపేట్ మండలాలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి పంపిణీ చేస్తారని తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడిపై ఫిర్యాదు

జహీరాబాద్ టౌన్: సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ నెల వెయ్యికోట్లు జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులకు పంపుతున్నారని, నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తూ వాట్సాప్, సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు. ఆయనపై కేసు నమోదు చేయాలని టౌన్ ఎస్‌ఐ కాశీనాథ్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, నాయకులు రాములు, జగదీశ్వర్‌రెడ్డి, అక్బర్, జమిలాలోద్దీన్ జగన్మోహన్ ఉన్నారు.

ఆలయాలు, చర్చిలు భక్తులతో కిటకిట

కొత్త ఏడాదిని పురస్కరించుకుని సంగారెడ్డిలోని పలు దేవాలయాలు, చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి. మొదటిరోజు మంచి జరిగితే ఏడాదంతా మంచి జరుగుతుందనే ఉద్దేశంతో జనమంతా ఆలయాల్లో బారులు తీరారు. వైకుంఠపురం ఆలయంలో రెండు గంటలకు పైగా క్యూ లైన్‌లో వేచి ఉండి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సీఎస్ఐ చర్చిలో సైతం జనం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులంతా కలసి సామూహిక గీతాలాపన చేసి అంతా మంచి జరగాలని ఏసుక్రీస్తును వేడుకున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



భక్తులకు తీర్థం అందిస్తున్న పూజారులు



సంగారెడ్డి సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన భక్తులు

ఇక మహిళా పెట్రోల్ బంక్

- సంగారెడ్డి బైపాస్‌రోడ్డులో ఏర్పాటు
- ఎనిమిది గుంటల భూమి కేటాయింపు
- ఐఓసీఎల్‌తో జిల్లా మహిళా సమాఖ్య ఒప్పందం
- ఈ వారంలో మంత్రి రాజనర్సింహతో శంకుస్థాపన
- మహిళా శక్తి పథకం అమలులో భాగంగా..



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు కూడా ఇకనుంచి పెట్రోల్ బంక్‌ను నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి పథకం అమలులో భాగంగా జిల్లా మహిళా సమాఖ్య (జెడ్ఎంఎస్) ఈ పెట్రోల్ బంకును ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్)తో జిల్లా మహిళా సమాఖ్య ఒప్పందం కుదుర్చుకుంది. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని పాత డీఆర్‌డీఓ కార్యాలయం ఆవరణలో ఈ బంక్‌ను నెలకొల్పనున్నారు. ఇందుకోసం ఎనిమిది గుంటల స్థలాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి కేటాయించారు. ఈ వారంలో ఈ బంక్ నిర్మాణ పనులకు మంత్రి దామోదర రాజనర్సింహతో శంకుస్థాపన చేయనున్నారు. కేవలం ప్రైవేటు వ్యక్తులే నిర్వహించే ఈ పెట్రోల్ బంకులను జిల్లాలో మూడు...నాలుగు చోట్ల జైళ్ల శాఖ ఏర్పాటు చేసి నిర్వహిస్తోంది. ఇదే మాదిరిగా జిల్లా మహిళా సమాఖ్య ద్వారా కొత్తగా ఈ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

రూ.1.99 కోట్లతో..

ఈ బంక్ ఏర్పాటుకు సుమారు రూ.1.99 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ నిధులను ఐఓసీఎల్‌నే భరిస్తుంది. ఈ సంస్థ బంకును పూర్తిగా నిర్మించి జిల్లా సమాఖ్యకు అప్పగిస్తుంది. ఈ జిల్లా సమాఖ్య ఈ పెట్రోల్ బంక్ నిర్వహణ బాధ్యతలను చూసుకుంటుంది. ఈ బంక్ నిర్వహణకు అవసరమైన నిధులను మాత్రం జిల్లా సమాఖ్య నిధులను వినియోగించనున్నారు. పెట్రోల్, డీజిల్, ఇంజినాయిల్ వంటి పెట్రోలియం ఉత్పత్తులను ఈ బంక్‌లో విక్రయించనున్నారు. ప్రస్తుతం సంగారెడ్డి బైపాస్‌రోడ్డులో ఎక్కడా పెట్రోల్ బంక్ లేదు. కేవలం మెయిన్ రోడ్డుపైనే పెట్రోల్ బంకులున్నాయి. బైపాస్‌రోడ్డులో దీన్ని ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులకు కూడా సౌకర్యంగా ఉంటుందనే అభిప్రాయం జిల్లా కేంద్ర వాసుల్లో వ్యక్తమవుతోంది.

మహిళలను ప్రోత్సహించేందుకే..

మహిళా శక్తి పథకం కింద జిల్లా మహిళా సమాఖ్య ద్వారా పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఈ బంక్ పూర్తిగా మహిళలే నిర్వహిస్తారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఎన్నో స్వయం ఉపాధి యూనిట్లను నడుపుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్న మహిళలు ఈ బంక్‌ను కూడా విజయవంతంగా నిర్వహిస్తారన్న నమ్మకముంది.

–వల్లూరు క్రాంతి, కలెక్టర్

30 మంది మహిళలతో నిర్వహణ

ఈ పెట్రోల్ బంక్ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించేందుకు స్వయం సహాయక సంఘాలలో ఆసక్తి ఉన్న మొత్తం 30 మంది మహిళలను మహిళా సమాఖ్య గుర్తించింది. మూడు షిఫ్టుల వారీగా వీరు ఈ బంక్‌ను నిర్వహించనున్నారు. బంక్ నిర్వహణపై వీరికి శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సమాఖ్య ఏపీఎం శ్రీదేవి తెలిపారు. బంక్ నిర్వహణ ద్వారా వచ్చే కమీషన్ మొత్తం జిల్లా సమాఖ్య ఖాతాలో జమ చేయనున్నారు. ఇందులో పనిచేసే మహిళలకు ఈ సమాఖ్య నుంచే వేతనాలు చెల్లిస్తారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు

- గంజాయి, గుడుంబాకు అడ్డాగా తెలంగాణ
- శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల మీద ఒత్తిడి తెచ్చి బీఆర్ఎస్ కార్యకర్తలపై, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తోందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డిలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కంటే ఈ ప్రభుత్వంలో ఈ ఏడాది ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే సుమారు వెయ్యి కేసులు పెరిగాయన్నారు. 2022లో జిల్లాలో 6,429 కేసులు నమోదైతే, 2024లో 7,563 కేసులు నమోదయ్యాయన్నారు. మహిళలపై అత్యాచారాల కేసులు 31% పెరిగాయని, రాష్ట్రమంతా ఇదే పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఈ కేసులు పెరగడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. హోంమంత్రిత్వ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యమేనన్నారు. గంజాయి, గుడుంబాకు తెలంగాణ అడ్డాగా మారిందని అన్నారు.

మహాపడి పూజకు హాజరైన హరీశ్

సదాశివపేట(సంగారెడ్డి): అయ్యప్పస్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా జీవించాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. పట్టణంలో జరిగిన మహాపడిపూజతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ 29వ ఇరుముడి, షష్టిపూర్తి తులాభారం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, జెడ్పీ మాజీ చైర్మన్ మంజుశ్రీ, బీఆర్ఎస్ నాయకులు పట్నం మాణిక్యం పాల్గొన్నారు.

12 మంది పోలీసులకు సేవా పతకాలు

సంగారెడ్డి జోన్: జిల్లాలో విధి నిర్వహణలో భాగంగా ఉత్తమ సేవలందించిన పలువురు పోలీసులు సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి బుధవారం పతకాల జాబితాను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ సేవా పతకాలలో జిల్లా నుంచి 12 మంది పోలీసులకు దక్కింది. ఉత్తమ సేవా పతకానికి ఒకరు, సేవా పతకాలకు 11 మంది ఎంపికయ్యారు.

ఉత్తమ సేవా పతకం

- సుదర్శన్, హెడ్ కానిస్టేబుల్, ఝరాసంగం

సేవా పతకాలు

- బక్కయ్య, ఎస్ఐ, డీసీఆర్‌బీ, సంగారెడ్డి
- డి.విశ్వనాథం, ఎస్ఐ, డీసీఆర్‌బీ, సంగారెడ్డి
- అబ్దుల్ ఖాదర్, ఎస్ఐ, ఏఆర్, సంగారెడ్డి
- ఎమ్.లక్ష్మణ్, ఎస్ఐ, ఏఆర్, సంగారెడ్డి
- ఎమ్.ధర్మ, ఎస్ఐ, ఏఆర్, సంగారెడ్డి
- కె.నామ్‌దేవ్, ఎస్ఐ, ఏఆర్, సంగారెడ్డి
- వి.సుదర్శన్, హెడ్ కానిస్టేబుల్, సంగారెడ్డి రూరల్
- సీహెచ్.పాయిలు, హెడ్‌కానిస్టేబుల్, ఏఆర్, సంగారెడ్డి
- ఎ.భాగ్యం గౌడ్, హెడ్ కానిస్టేబుల్, ఏఆర్, సంగారెడ్డి
- వి.శంకర్, హెడ్ కానిస్టేబుల్, ట్రాఫిక్, పటాన్‌చెరు
- ఎండి.అబ్దుల్ బారి, కానిస్టేబుల్, ట్రాఫిక్, సంగారెడ్డి

ధైర్య సాహసాలు ప్రదర్శించినందుకే..



శ్రీనివాస్

జహీరాబాద్ టౌన్: ధైర్య సాహసాలు ప్రదర్శించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా విధులు నిర్వహించినందుకు రాష్ట్ర ఫైర్‌సర్వీసెస్ శౌర్య పతకం లభించిందని జహీరాబాద్ అగ్నిమాపక కేంద్రంలోని లీఠింగ్ ఫైర్‌మన్ బి. శ్రీనివాస్ అన్నారు. పతకం లభించిన ఆనందాన్ని ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు. తన స్వగ్రామం ఝరాసంగం మండలంలోని బిడకన్నె అని చెప్పారు. 2011లో అగ్నిమాపక శాఖలో చేరగా...2017 వరకు మెదక్, 2017–20 వరకు సదాశివపేట, 2020–24 వరకు సంగారెడ్డి అగ్నిమాపక కేంద్రంలో పనిచేసి జూన్ 24న జహీరాబాద్‌కు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ''సంగారెడ్డిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో కెమికల్ పరిశ్రమల్లో భారీ ప్రమాదం చోటు చేసుకోగా ఆ పరిశ్రమకు 5 కిలో మీటర్ల దూరంలో ఉన్నాను. వెంటనే స్పందించి పది నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకుని సహాయ చర్యలు ప్రారంభించాను. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాను. అప్పటికే ఒక రియాక్టర్ పేలగా.. పక్కనే పేలడానికి సిద్ధంగా ఉన్న మరో రియాక్టర్‌ను బ్లాస్ట్ కాకుండా నియంత్రించాను. దీంతో ప్రాణహాని, ఆస్తి నష్టం జరగలేదు. అదేవిధంగా పాశమైలారంలోని ఓ పరిశ్రమలో కూడా భారీ ప్రమాదం జరగ్గా...వెంటనే రంగంలోకి దిగి ఆస్తి నష్టం, ప్రాణహాని జరగకుండా చురుగ్గా వ్యవహరించాను. రిస్క్ కాల్స్ అటెండ్ చేసి సుమారు 10 మందికి పైగా ప్రాణాలను కాపాడాను. మంజీర డ్యామ్‌లోని 10 వరకు మృతదేహాలను బయటకు తీశాను. అందుకే ఈ పతకం లభించి''నట్లు ఆయన చెప్పారు.

కేతకీలో '2025' వేడుకలు



ఆలయ మంటపంలో భక్తుల సందడి

ఝరాసంగం(జహీరాబాద్): నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని బుధవారం దక్షిణ కాశీగా ప్రసిద్ధిచెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయం భక్తులతో సందడిగా మారింది. గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలతో పాటు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

క్రీడల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు/రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడలు దినచర్యలో భాగం కావాలని, క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నూతన సంవత్సరం సందర్భంగా నిరంజన్ ఎలెవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్, జిన్నారంలో ఐదు ఎక రాల విస్తీర్ణంలో మినీ స్టేడియాలు నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం విజేతలుగా నిలిచిన నిరంజన్ 11, కేబీఎస్ జట్లకు ట్రోఫీలు అందజేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల అభివృద్ధికి కృషి

రిటైర్డ్ ఉద్యోగస్తుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం రామచంద్రాపురం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సరం 2025 క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించారు.

రారెత్తిస్తున్న శునకాలు

- వాహనదారులు, పాదచారులను వెంబడిస్తున్న కుక్కలు
- రాత్రివేళ బయటకు వెళ్లలేని పరిస్థితి
- చర్యలు తీసుకోవాలంటున్న జిల్లా వాసులు



సంగారెడ్డి పట్టణంలో సంచరిస్తున్న కుక్కలు

సంగారెడ్డిటౌన్: జిల్లాలో కుక్కల బెడద అధికమైంది. జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట కుక్కకాటు బాధితులు ఆస్పత్రుల పాలవుతున్నారు. కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడం, అవి కరుస్తుండటంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో రద్దీ ప్రాంతాలు, రహదారులపై గుంపులుగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళ రోడ్లపై ఉంటూ ద్విచక్ర వాహనదారులు, పాదచారులను వెంబడిస్తున్నాయి. కొందరు వీటి కాటుకు గురవుతుండగా మరికొందరు వాహనాలపై నుంచి పడి గాయాల పాలవుతున్నారు. దీంతో వీధి కుక్కలతో ప్రజలు వణికి పోతున్నారు. మరికొన్ని చోట్ల ద్విచక్ర వాహనాలను వెంబడిస్తూ ఒంట్లో వణుకుపుట్టిస్తున్నాయి. కుక్కల శస్త్ర చికిత్సల పేరిట ఏటా నిధులు ఖర్చు చేస్తున్నా వాటి సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. జిల్లాలో సుమారు 1,67,622 కుక్కలు వున్నాయి. నియంత్రణ బాధ్యత స్థానిక సంస్థలు అయినప్పటికీ సిబ్బంది కొరత, ఇతర కారణాలతో పట్టించుకోవడం లేదు. వాటిని పట్టి తీసుకెళ్లే వాహనాలు సైతం జిల్లాలో అరకొరగా ఉన్నాయి. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి వీటికి యాంటీ రేబిస్ టీకాలు వేయాలి. కానీ ఈ ప్రక్రియ సక్రమంగా జరగకపోవడంతో జిల్లాలో కుక్కల సంఖ్య పెరిగింది.

నిధులు వెచ్చిస్తున్నప్పటికీ..

జిల్లాలోని పట్టణాలతోపాటు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. సంగారెడ్డికి సంబంధించి కుక్కల నియంత్రణ కేంద్రాన్ని కాశీపూర్ సమీపంలో ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా రూ.లక్షల్లో ఖర్చు చేసి శునకాలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కొన్ని శునకాలకు మాత్రమే నియంత్రణ చర్యలు చేపట్టారనే ఆరోపణలున్నాయి. ఒక్క సంగారెడ్డిలోనే 4 వేలకు పైగా కుక్కలున్నట్లు చెబుతున్నారు.

ఇటీవల జిల్లాలో పలు కుక్క కాటు ఘటనలు

- పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్‌లో మూత్ర విసర్జనకు వెళుతున్న సమయంలో ఓ బాలుడిని నాలుగు వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయి.
- సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలోని 12వ వార్డులో ఏడేళ్ల బాలుడిని పది కుక్కలు కరిచాయి. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు.
- సంగారెడ్డి శాంతినగర్‌లో మూడేళ్ల బాలుడిని కుక్కలు దాడి చేశాయి
- జహీరాబాద్‌లోని రాంనగర్‌లో కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి.
- సదాశివపేట పట్టణంలో ఇద్దరు మహిళలు, బాలుడిపై దాడి చేశాయి.

బయటకు వెళ్లాలంటే భయమే...



కుక్కలు ఎక్కువై పోయాయి. పాఠశాల నుంచి వచ్చే సమయంలో ఆడుకోవడానికి వెళ్లాలన్న కూడా కుక్కలు గుంపులుగా తిరగడంతో భయమేస్తుంది. కిరాణ షాప్‌కు వెళ్లి వస్తున్నప్పుడు వెంబడిస్తున్నాయి.

-ప్రవీణ్, విద్యార్థి

కుక్కలను నియంత్రించాలి



కుక్కల సంఖ్య పెరగడంతో పట్టణంలోని పలు కాలనీలలో మహిళలకు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కుక్కలు పెరిగిపోతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

శ్రీధర్ మహేంద్ర, స్థానికుడు

చర్యలు తీసుకుంటాం



కుక్కల సంతానోత్పత్తిని తగ్గించేందుకు చర్యలు చేపడతాం. వీధి కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తాం...ప్రజలు కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

డాక్టర్ వసంత కుమారి
జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

క్లుప్తంగా

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

12 మందిపై కేసు నమోదు


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

తూప్రాన్: పేకాట స్థావరం పై పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని అల్లాపూర్ శివారులో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు సీఐ రంగాకృష్ణ ఆధ్వర్యంలో దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.52 వేల నగదుతో పాటు ఐదు బైక్‌లు, యాక్టివా, ఆటోను సీజ్ చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో పీహెచ్‌డీ విద్యార్థి మృతి


దేవదాస్

సిద్దిపేటరూరల్: బ్రెయిన్ స్ట్రోక్‌తో పీహెచ్‌డీ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రాఘవాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కోదాది దేవదాస్ ఇటీవల ఎస్‌బీఐ బ్యాంకింగ్‌పై ఐదేళ్ల పాటు తన పరిశోధనను నిర్వహించి పీహెచ్‌డీ చదువును పూర్తి చేశాడు. త్వరలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పట్టా సర్టిఫికెట్ అందుకోవాల్సి ఉంది. శనివారం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

అనుమానాస్పదస్థితిలో మున్సిపల్ జవాన్ మృతి


మెదక్ డంప్‌యార్డులో వేలాడుతున్న సంజీవ్ మృతదేహం

మెదక్ మున్సిపాలిటీ: అనుమానాస్పదస్థితిలో మున్సిపల్ జవాన్ మృతి చెందాడు. ఈ సంఘటన మెదక్ డంప్‌యార్డులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని పిట్లంబేస్ వీధికి చెందిన మల్లారెడ్డిపేట సంజీవ్(41) మెదక్ మున్సిపల్ కార్యాలయం శానిటేషన్ విభాగంలో ఔట్ సోర్సింగ్‌లో జవాన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 9గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. డిసెంబర్ 31 సందర్భంగా స్నేహితులతో కలసి ఉన్నట్లుగా ఇంట్లో వారికి సమాచారం ఇచ్చాడు. బుధవారం తెల్లవారుజామున మూడు గంటల వరకు సంజీవ్ తన భార్య సావిత్రితో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. అనంతరం ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని మృతుడి భార్య సావిత్రి తెలిపారు. ఈ క్రమంలో మెదక్ డంప్‌యార్డులో సంజీవ్ ఉరివేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంజీవ్ మృతి పట్ల పలు అనుమానాలు ఉన్నాయని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి కుమారుడు రాజు, కూతురు పూజిత ఉన్నారు.

పొలానికి వెళ్లిన వృద్ధురాలి అదృశ్యం


నర్సమ్మ (ఫైల్)

కుల్కచర్ల: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల గ్రామానికి చెందిన శివ్వని నర్సమ్మ(69) మంగళవారం పొలం దగ్గరకు వెళ్లి తిరిగి రాలేదు. పొలం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో నర్సమ్మ కుమారుడు భీమయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాగుడు మూతలు

బంగారం ధర రూ 80 వేలకుపైనే..
- ఒకే నెలలో ధరలో వ్యత్యాసం
- ఏడు నెలల్లో రూ.10వేలు జంప్
- సందిగ్ధంలో వ్యాపారులు


సిద్దిపేటలోని ఓ జ్యువెలరీ షాపు

సిద్దిపేటజోన్: గత కొన్ని నెలలుగా బులియన్ మార్కెట్‌లో పసిడి ధర దాగుడు మూతలు ఆడుతోంది. పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో బంగారం ధర ఎటువైపు పోతుందో అర్థం కావడం లేదన్న అభిప్రాయం పసిడి వ్యాపారుల నుంచి వినిపిస్తోంది. జిల్లాలో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీల్లో 150కి పైగా జ్యువెలరీ షాపులు, పట్టణాలు, మండల కేంద్రాల్లో బంగారం విక్రయాలు, స్వర్ణకారులు సుమారు రెండు వేల వరకు ఉన్నట్లు సమాచారం. వివాహ శుభ కార్యాలు. ఇతర అవసరాలకు, అదేవిధంగా అక్షయ తృతీయ, ధనత్రయోదశి నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పసిడి కొనుగోలు చేస్తుంటారు. ఒక్క ధనత్రయోదశి, అక్షయ తృతీయ రోజుల్లోనే పసిడి విక్రయ వ్యాపారులు కోట్లాది రూపాయల విలువైన బంగారం అమ్మకాలు సాగిస్తుంటారు.

ధరల్లో వ్యత్యాసాలు

బులియన్ మార్కెట్‌లో పసిడి డిమాండ్ మేరకు వాటి ధర ఒక్కోసారి ఆకాశానికి అందనంత పైకి చేరుతుంది. అదే ధర సడన్‌గా తగ్గుముఖం పడుతుంది. ఈ విధంగా బంగారం ధర విషయంలో హెచ్చుతగ్గుల అంశం అటు వ్యాపారులు, ఇటు కొనుగోలు దారులను గందరగోళంలో పడేస్తుంది. గతేడాది తులం బంగారం రూ 60 వేలు పలుకగా.. ఏడు నెలల్లో ఏకంగా రూ. 20 వేలు ఎగబాకడం విశేషం. 2023లో రూ 69 వేలు ఉన్న బంగారం, జూన్ మొదటి వారంలో రూ 71.600 పలుకగా, మాసం చివరికి వచ్చేసరికి రూ 74 వేలకు చేరింది. ఆగస్టులో 72 వేలు పలికిన బంగారం.. సెప్టెంబరు నాటికి రూ 74 వేలకు చేరింది. మరో వైపు అక్టోబర్‌లో పసిడి ధర విషయంలో భారీ స్థాయిలో హెచ్చుతగ్గులు కన్పించింది. అక్టోబర్ 10న జిల్లాలో తులం బంగారం రూ 77వేలు పలుకగా, అదే నెల 20న రూ 81 వేలకు చేరుకుని అందరిని ఆశ్చర్యపర్చింది. అదే ధర నవంబర్ 20నాటికి తగ్గుముఖం పట్టి రూ 78 వేలకు పడిపోయింది. డిసెంబర్‌లో పెళ్లిళ్ల దృష్ట్యా మొదటి వారంలో రూ 78,600 ధర పలుకగా, మూడో వారంలో రూ 79,500కు చేరింది. ప్రస్తుతం పెళ్లిళ్ల ఆశించిన స్థాయిలో లేకపోయినా బంగారం ధర డిసెంబర్ 25న రూ 78,700 పలికింది. ఒక్క నెల వ్యవధిలోనే పసిడి ధరలో గణనీయమైన మార్పులు కన్పించడంతో తప్పనిసరి పసిడి కొనుగోలు చేసిన వారు తగ్గిన ధరను చూసి విస్తుపోతున్నారు. 22క్యారెట్ల బంగారం ధర 24 క్యారెట్ల మేలిమి బంగారం కంటే 6వేలు తక్కువగా ఉండటం విశేషం.

తప్పనిసరి పరిస్థితి



శుభకార్యాల అవసరాల నిమిత్తం తప్పనిసరి బంగారం కొనుగోలు చేయాల్సి వస్తుంది. బంగారం ధర విషయంలో ఒకే నెలలో తేడా ఉండటంతో కొంత ఇబ్బందిగానే ఉంటుంది. ప్రస్తుతం రూ 80 వేలు దాటినా.. బంగారం భవిష్యత్‌లో ఎక్కడి వరకు పోతుందో అర్థం కావడం లేదు. –స్వప్న (గృహిణి, సిద్దిపేట)

అర్థం కావడం లేదు



ముప్పై ఏళ్లుగా స్వర్ణ కారుడిగా పనిచేస్తున్నా. ప్రస్తుతం పసిడి ధరలో వ్యత్యాసం చూస్తుంటే అర్థం కావడం లేదు. దీంతో ఆభరణాలకు ఆర్డర్ ఇచ్చే వారికి స్పష్టంగా ధర చెప్పలేని పరిస్థితి నెలకొంది. అందుకే రోజువారీ బులియన్ మార్కెట్ ధర మేరకు బంగారం అమ్మకాలు చేస్తున్నాం. –దేవచారి (స్వర్ణకారుడు, సిద్దిపేట)

376 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు

ఉమ్మడి జిల్లాలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు


సిద్దిపేట: డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు


సంగారెడ్డిలో..

సంగారెడ్డిజోన్/సిద్దిపేటకమాన్/నర్సాపూర్: ఉమ్మడి మెదక్ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా మొత్తం 376 మందిపై కేసులు నమోదు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 282, సిద్దిపేటలో 87, నర్సాపూర్‌లో 7 చొప్పున నమోదయ్యాయి. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు మంగళవారం అర్ధరాత్రి నుంచి డ్రంకెన్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేశారు. కాగా, నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

అతిగా మద్యం తాగి ఇద్దరు మృతి

తాగిన మైకంలో మేస్త్రీ ఆత్మహత్య

దుబ్బాక: మద్యానికి బానిసైన ఓ మేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన దుబ్బాక పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన చింతల రాంచంద్రం (70) భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా రాంచంద్రం తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటికి తాగి వచ్చి తినిపడుకున్నాడు. మళ్లీ అర్ధరాత్రి సమయంలో ఇంట్లోనే మద్యంలో గడ్డిమందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కడుపులో తీవ్ర నొప్పి కలగడంతో విషయాన్ని భార్యకు తెలిపాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు 108 ద్వారా సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పడుకున్న చోటే మృతి

పటాన్‌చెరు టౌన్: అతిగా మద్యం తాగిన వ్యక్తి పడుకున్న చోటే మృతి చెందాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ము సమీపంలోని ఐ-కన్వెన్షన్ హాలులో నివాసమంటూ ఐడీఏ బొల్లారం పరిధిలో ఓ టింబర్ డిపో వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రాజు నాయుడు(50) మంగళవారం అతిగా మద్యం తాగి పడుకున్నాడు. బుధవారం స్థానికంగా పనిచేసే వారు చూడగా.. పడుకున్న చోటే మృతి చెంది కనిపించాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి ఫ్లెక్సీ రగడ

- ఇరువర్గాల మధ్య వాగ్వాదం, ఉద్రిక్తత
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం


వల్లూర్‌లో గొడవ పడుతున్న ఇరువర్గాలు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ గొడవకు దారితీసింది. దీంతో మంగళవారం అర్ధరాత్రి దళితులు, ముదిరాజ్‌ల మధ్య ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో శుభాకాంక్షల ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా.. ముదిరాజ్‌లు అభ్యంతరం తెలిపారు. గతంలో దసరా పండుగ సమయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించి వేయడంతో పంచాయితీ జరిగింది. అయితే.. ఇక్కడ ఎవరూ ఫ్లెక్సీని ఏర్పాటు చేయవద్దని పోలీసులు ఆదేశించారు. అలాంటప్పుడు మళ్లీ ఎందుకు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని ముదిరాజ్‌లో నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి ఉద్రిక్తతకు దారితీసింది. విషయం తెలుసుకున్న నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. సీఐ వెంకటరాజంగౌడ్ వారితో చర్చించారు. ఎవరైనాసరే ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలంటే పంచాయతీ అనుమతి తీసుకోవాలని, పైగా గతంలో తీర్మానం చేసిన విషయాన్ని సీఐ అంబేడ్కర్ సంఘం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు ఫ్లెక్సీని తొలగించేందుకు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు రిమాండ్

నిందితుల్లో ఒకరు సిద్దిపేటవాసి


పోలీస్ స్టేషన్‌లో యువకులు

పహాడీషరీఫ్: మహిళ మెడలో బంగారు గొలుసును తస్కరించిన ఇద్దరు యువకులను రంగారెడ్డి జిల్లా పహాడీషరీఫ్ పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. డిసెంబరు 30న రాత్రి 9.30 గంటలకు సరస్వతి(56) తుక్కుగూడలోని తన కిరాణా దుకాణాన్ని మూసేసి, నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. వెనుక నుంచి స్కూటీపై వచ్చిన యువకులు ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును తెంచుకొని ఉడాయించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. హన్మకొండకు చెందిన గజ్జెల్లి వశిష్ట, సిద్దిపేటకు చెందిన బొగ్గుల అభిలాష్ బతుకుదెరువు నిమిత్తం తుక్కుగూడకు వచ్చి ఫ్యాబ్‌సిటీలోని రీనోసిస్ కంపెనీలో పని చేస్తున్నారు. చెడు అలవాట్లకు బానిసైన వీరు, వేతనం సరిపోక దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే సరస్వతి మెడలోని గొలుసును తెంపుకొని పారిపోయారు. వీరినుంచి గొలుసు, యాక్టివా వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

లక్ష మందితో బీసీ గర్జన

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్‌కృష్ణ


ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న లాల్‌కృష్ణ తదితరులు

పరిగి: పరిగి పట్టణ కేంద్రంలో మార్చి చివరి వారంలో లక్ష మందితో బీసీ గర్జన నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్‌కృష్ణ తెలిపారు. ఆర్.కృష్ణయ్య రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీల సింహగర్జన నిర్వహణపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో చర్చించామన్నారు. పరిగి పట్టణ కేంద్రంలోనే లక్ష మందితో సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ ఆనంద్‌గౌడ్, నాయకులు రాముయాదవ్, చిన్ననర్సింహులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై నుంచి వెళ్లిన లారీ

అక్కడికక్కడే వ్యక్తి మృతి


నీరుడి కృష్ణ


పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

హత్నూర(సంగారెడ్డి): రోడ్డు పక్కన పడుకున్న ఓ వ్యక్తిపై నుంచి లారీ వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన హత్నూర మండలం మల్కాపూర్ గ్రామ శివారులోని ఓ పరిశ్రమ సమీపంలో జరిగింది. గ్రామానికి చెందిన నీరుడి కృష్ణ (27) సోమవారం రాత్రి మల్కాపూర్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద సంగారెడ్డి నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కన పడుకున్నాడు. అదే మార్గంలో వెళుతున్న పొట్టు లారీ అతనిపై నుంచి వెళ్లింది. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. సీసీ పుటేజీల ఆధారంగా ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పరిశ్రమ ఎదుట గ్రామస్తులు ఆందోళన

కాగా, సుధావర్షిని పరిశ్రమ ఎదుట మంగళవారం గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పరిశ్రమకు పొట్టును తీసుకొచ్చే లారీ వల్లే కృష్ణ మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించి కూర్చున్నారు. ఎస్సై సుభాష్ ఆందోళనకారులకు నచ్చజెప్పి శాంతింపజేశారు.

బస్సును ఢీకొన్న లారీ.. 8 మందికి గాయాలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని బైపాస్ రోడ్డు అల్గోల్ చౌరస్తాలో బుధవారం ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో 8 మందికి స్వల్ప గాయాలయ్యాయి. పట్టణ సమీపంలో రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నందున నెల రోజుల పాటు ట్రాఫిక్‌ను బైపాస్ రోడ్డు గుండా మళ్లించారు. బీదర్, ముంబై, మొగుడంపల్లి తదితర ప్రాంతాలకు వాహనాలు అల్గోల్ చౌరస్తా నుంచి బైపాస్ రోడ్డు మీదుగా వెళుతున్నాయి. ఈ క్రమంలో జహీరాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు అల్గోల్ చౌరస్తా వద్ద రోడ్డు ఎక్కుతుండగా వెనుకాల నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో బస్సులోని 8 మంది ప్రమాణికులు గాయపడ్డారు. వారిని వెంటనే జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా బైపాస్ రోడ్డుపైన బస్సు, లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. జహీరాబాద్ టౌన్ ఎస్.ఐ.కాశీనాథ్ సంఘటన స్థలానికి చేరుకుని వాహనాలను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

స్నేహితులను కలిసి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు


భానుచందర్

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కొండపాక పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెలికట్ట శివారులో చోటుచేసుకుంది. కొండపాక మండలం వెలికట్టకు చెందిన భానుచందర్(22), భాను ప్రకాశ్(19) మంగళవారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై విశ్వనాథపల్లిలో ఉన్న స్నేహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వెలికట్ట శివారులో రాజీవ్ రహదారి పక్కన ఉన్న సూచిక బోర్డును ఢీకొట్టారు. ఈ క్రమంలో భానుచందర్ ఎగిరి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి తగలడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భానుప్రకాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్నేహితులు.. క్షతగాత్రుడు భానుప్రకాశ్‌ను సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకొన్న కొద్దిసేపటికే భానుచందర్ మృతి చెందటంతో తోటి స్నేహితులు కన్నీరు మున్నీరయ్యారు.

తెలంగాణలో చోరీ.. ఆంధ్రాకు పరారీ

- కారుతో ఉడాయించిన నిందితుడికి రిమాండ్
- ఐదుతులాల బంగారం స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన షాద్‌నగర్ టౌన్ సీఐ విజయ్‌కుమార్


కేసు వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణలో చోరీలు చేస్తూ.. దొంగిలించిన సొత్తుతో ఆంధ్రప్రదేశ్‌కు పరారవుతున్నాడు. ఇదే క్రమంలో డిసెంబర్ 23న తాళం వేసిన ఓ రియల్‌ఎస్టేట్ ఆఫీస్ తాళం పగులకొట్టి దొంగతనానికి యత్నించగా ఏమీ దొరకలేదు. దీంతో కార్యాలయం ఎదుట పార్క్ చేసిన కారుతో ఉడాయించాడు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించిన పోలీసులు డిసెంబర్ 31న కారును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు బుధవారం షాద్‌నగర్ టౌన్ సీఐ విజయ్‌కుమార్ వెల్లడించారు.

తాళం వేసిన ఇళ్లు, కార్యాలయాలే టార్గెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా ప్రొద్దుటూరులోని శాకాపురానికి చెందిన పిల్లిబద్రి అలియాస్ మహేశ్ కొన్ని రోజులుగా పట్టణంలోని తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నాడు. అనంతరం ఇక్కడ నుంచి స్వస్థలానికి పరారవుతున్నాడు. ఇదే క్రమంలో పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన భిక్షపతిగౌడ్ రియల్‌ఎస్టేట్ వ్యాపారి. ఆయన ఈ నెల 23న కేశంపేట చౌరస్తాలోని తన రియల్ ఎస్టేట్ కార్యాలయం వద్ద కియా సెల్టోస్ కారును పార్కు చేసి తాళాలు ఆఫీస్‌లో పెట్టి వెళ్లిపోయాడు. రియల్ ఎస్టేట్ కార్యాలయంలో చోరీకి యత్నించిన మహేశ్‌కు ఏమీ దొరక్కపోవడంతో తాళాలు తీసుకుని కారుతో ఉడాయించాడు. డిసెంబర్ 24న కార్యాలయానికి వచ్చిన భిక్షపతిగౌడ్‌కు కారు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టోల్‌చార్జీ కట్ అవ్వడంతో..

కారు యజమానికి టోల్‌గేట్ వద్ద డబ్బులు కట్ అవ్వడంతో మెసేజ్ రాగానే ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దొంగ అక్కడ నుంచి రూట్ మార్చడంతో సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పట్టుకుని పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో పట్టణంలోని కీర్తి వెంచర్, గీత రెస్టారెంట్, చటాన్‌పల్లి ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. మంగళవారం నిందితుడి వద్ద నుంచి కారుతో పాటుగా ఐదు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, క్రైం డీసీపీ నర్సింహాగౌడ్, సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, సీఐ పవన్‌కుమార్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో పట్టణ సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎస్‌ఐ శరత్‌కుమార్, సిబ్బంది మోహన్, కరుణాకర్, జాకీర్, రాజు, రఫీ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించారని.. వారికి పోలీసు ఉన్నతాధికారులతో రివార్డులు ఇప్పిస్తామని సీఐ విజయ్‌కుమార్ అన్నారు.

జూనియర్ వైద్యుడిపై దాడి

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

సిద్దిపేటకమాన్: విధుల్లో ఉన్న జూనియర్ వైద్యుడిపై ఓ వ్యక్తి చేయి చేసుకుని దాడి చేసిన ఘటన ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. జూనియర్ వైద్యులు, పోలీసుల కథనం ప్రకారం.. జూనియర్ వైద్యుడు హరీశ్ ప్రభుత్వ ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలో విధులు నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఓ వ్యక్తి అనారోగ్యంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరాడు. పరీక్షించిన వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వార్డుకు షిఫ్ట్ చేశారు. ఈ క్రమంలోనే పట్టణానికి చెందిన శ్రవణ్ అనే వ్యక్తి వైద్యుడితో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఆ వ్యక్తి జూనియర్ వైద్యుడిపై దాడిచేశారు. దీంతో వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆసుపత్రికి చేరుకున్న వన్ టౌన్ పోలీసులు దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దాడి ఘటనను నిరసిస్తూ విధులు నిర్వహిస్తున్న వైద్యులు బుధవారం ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఏసీపీ మధు, సీఐ వాసుదేవరావు ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకొని వైద్యులకు నచ్చజెప్పడంతో వారు నిరసన విరమించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.